ప్రజాశక్తి
గురువారం 27 నవంబర్ 2025 5
విజయనగరం



నేడు, రేపు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27, 28 తేదీల్లో ఎస్ఎఫ్ఐ 33వ జిల్లా మహాసభ విజయనగరంలోని లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్, ఉపాధ్యక్షులు జె.రవికుమార్ తెలిపారు. మహాసభల ప్రారంభ సూచికగా గురువారం ఉదయం 10గంటలకు ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి వేలాది మంది విద్యార్థులతో గురజాడ కళాభారతి వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ అధ్యక్షురాలు, ప్రస్తుత సహాయ కార్యదర్శి ఐషీఘోష్, రాష్ట్ర అధ్యక్షులు పూడి రామ్మోహన్ ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. విద్యార్థులంతా హాజరై మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు



నెల్లిమర్లలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

లేబర్‌కోడ్‌లపై నిరసనలు

కలెక్టరేట్ వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికులకు, రైతులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేకుంటే మోడీకి తగిన గుణపాఠం తప్పదని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు హెచ్చరించాయి. బుధవారం కలెక్టరేట్ వద్ద ఆయా సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాడే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేసే మోడీ ప్రభుత్వం అమలుకు నోటిఫై చేసిందని, ఈ కోడ్‌ల తో కార్మికులకు లాభం కంటే నష్టమే అధికంగా ఉందని అన్నారు. ఇప్పటికే కార్మిక సంఘాలు, వారికి మద్దతుగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు లేబర్ కోడ్స్‌ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయని చెప్పారు. అయినా మోడీ ప్రభుత్వం బీహార్ ఎన్నికల అనంతరం వీటి అమలుకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఉత్తర్వులో కీలకమైన కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కూలీల ప్రయోజనాల కంటే పెట్టుబడిదారులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాల కంటే పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాలే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తుందనడానికి లేబర్ కోడ్స్ అమలే నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి కలిసి లేబర్ కోడ్‌లను బలపరుస్తున్నాయని మండిపడ్డారు. ఇవి అమల్లోకి వస్తే కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం లేదని, మోడీ ప్రభుత్వం జాతీయ కనీస వేతనంగా నిర్ణయించిన రోజువారీ వేతనం 178 రూపాయలకు తగ్గకుండా వేతనం చెల్లిస్తే సరిపోతుందని, గ్రాట్యుటీ, బోనస్, హెచ్‌ఆర్, ఐఆర్ వంటి చట్టాలకు తూట్లు పొడిచారని అన్నారు. 8 గంటల పని దినాన్ని 10 నుంచి 13 గంటలకు పెంచడం ద్వారా కార్మికులపై పని భారంతో పాటు, నిరుద్యోగం పెరుగుతుందని, లేబర్ కోడ్‌లతో యజమానులకు తప్ప, కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. వెంటనే రద్దు చేయకపోతే పెద్దఎత్తున పోరాడుతామని తెలిపారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సురేష్, టివి రమణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, బుగత అశోక్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఎఐసిసిటియు నాయకులు అప్పలరాజు, ఎఐఎఫ్ టియు నాయకులు రెడ్డి నారాయణరావు, ఐఎఫ్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎం.కౌశిక్, కార్యదర్శి ఎం.మధు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ, ఐఎఫ్‌టియు నాయకులు అప్పలరాజు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, శ్రామిక మహిళ సంఘం నాయకులు బి.సుధారాణి కార్మిక, రైతు, వ్యవసాయ సిఐటియు నాయకులు పి.శంకరరావు, ఎ.గౌరినాయుడు, బి.సూర్యనారాయణ, యుఎస్ రవి కుమార్ కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల ద్రోహి మోడీ ప్రభుత్వం

బొబ్బిలి: కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బొబ్బిలి జెండా మహల్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, నాయకులు రాకోటి నాగమ్మ, ఎఐటియుసి పట్టణ నాయకులు సత్యనారాయణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: నాలుగు లేబర్ కోడ్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌కోట బ్రాంచ్ ఎంప్లాయిస్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఐఇఎ ఎస్‌కోట బేస్ యూనిట్ కార్యదర్శి జి. రాకేష్ వర్మ మాట్లాడుతూ జాతీయ సంఘం ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయడాన్ని ఖండించిందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, పెన్షనర్స్ ఏజెంట్లు పాల్గొన్నారు.

రాజాం: లేబర్‌కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆలిండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. రాజాంలో బిసియుఐఇ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజాం బిసియుఐఇ బేస్ యూనిట్ కార్యదర్శి జితేందర్ రావు, అధ్యక్షులు పి ప్రభాకర్‌రావు సహా వందలాది మంది ఉద్యోగులు పెన్షనర్లు ఏజెంట్లు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నెల్లిమర్ల : నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, ఎఐటియుసి నాయకులు మొయిద పాపారావు డిమాండ్ చేశారు. స్థానిక మొయిద జంక్షన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండల కరువులు, బొత్స నారాయణ, సుంకర అప్పారావు, మన్యపురి సన్యాసిరావు, రాము, ఎఐటియుసి నాయకులు పి.సూరి, వెంకటప్పడు, వైసిపి కార్మిక నాయకులు కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.కోట ఎల్ఐసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు



పుస్తక మహోత్సవానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతికశాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం రెండోరోజు బుధవారం ఉత్సాహంగా సాగింది. పురిపండా అప్పలస్వామి ప్రాంగణం విద్యుత్ కాంతులతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. పుస్తక ప్రియులు, పలువురు కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు బుక్‌స్టాల్స్‌ను తిలకించారు. పలు పాఠశాలల విద్యార్థులను పుస్తక మహోత్సవాన్ని తిలకించి పలు రకాల పుస్తకాలను కొనుగోలు చేశారు. డాక్టర్ డి.వెంకటరావు అధ్యక్షతన సాహితీ కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన 'నదికి ఒక భాష ఉంది' అనే పుస్తకాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయులు తేజోమూర్తుల సూర్య ప్రకాష్ పరిచయం చేశారు. కళింగాంధ్ర కథలు గురించి మరో రచయిత మల్లిపురం జగదీష్ చెప్పారు. పుస్తక మహోత్సవాన్ని వేదంతా జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించి, పుస్తకాలను కొనుగోలు చేశారు. పలువురు ఉపాధ్యాయులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆకట్టుకున్న జెవివి ప్రదర్శనలు

మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దెయ్యాలు, భూతాలపై నమ్మకాలను పారదోలుతూ నిర్వహించిన శాస్త్రీయ కార్యక్రమాలు ఆకర్షించాయి. చేతి మీద రాసిన తెల్ల సున్నాన్ని రక్తపు రంగుగా మార్చడం, చేతి మీద కర్పూరాన్ని వెలిగించి నాలుకపై పెట్టడం, బలంగా ఊదిన తాడు కింద పడకుండా ఉండే ప్రయోగాలు చాలా అద్భుతంగా చేపట్టారు. ఈకార్యక్రమాలను జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్.మహేష్, ఆర్.సతీశ్ రాజు, జీ.మురళీధర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులను, పుస్తక ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుస్తక మహోత్సవాన్ని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఐషీ ఘోష్ తిలకించారు. ఆమెకు బుక్ ఫెస్టివల్ నిర్వాహకులు, ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికారు.

జిల్లాకు అంచనాల కమిటీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర అంచనాల కమిటీ బుధవారం సాయంత్రం జిల్లాకు చేరుకుంది. కమిటీ ఛైర్మెన్ వి.జోగేశ్వరరావు, సభ్యులు నిమ్మక జయకృష్ణ, డాక్టర్ పివివి సూర్యనారాయణరాజులకు జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, డిఆరఒ ఎస్. శ్రీనివాసమూర్తి స్థానికంగా ప్రైవేటు అతిదిగృహం వద్ద పుష్ప గుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. జిల్లాకు సంబంధించిన విషయాలపై కొద్దిసేపు చర్చించారు. అంతకుముందు కమిటీ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశం రామనారాయణం సందర్శించింది. వీరికి అక్కడ ఆర్డీవో డి.కీర్తి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష స్వాగతం పలికారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతులతో కలిసి ఉద్యమిస్తాం

డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల పేరిట భూములు తీసుకొని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నాయనిజిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. గుర్ల మండలంలో స్టీల్‌ప్లాంట్‌కు పచ్చని పంట పొలాలను తీసుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, రైతులతో కలసి ఉద్యమిస్తామని చెప్పారు. బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూల మల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పరిరక్షణ దినంగా రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతి యువకులపై ఉందన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి చట్టాలు, దొంగ చట్టాలు తీసుకువచ్చి , రాజ్యాంగంలో వారికి అనుకూలంగా మార్పులను చేస్తున్నారన్నారు. చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారుపరిశ్రమల కోసమని రైతుల నుంచి భూములు తీసుకొని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. జిల్లాలో మరో భూ బాగోతానికి తెర లేపుతూ గుర్ల మండలంలో స్టీల్ ప్లాంట్ పేరిట సాగుములను రైతుల నుంచి తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇదే జరిగితే రైతులతో సహా పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో శృంగవరపుకోట నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ గేదెల తిరుపతి, గజపతినగరం కన్వీనర్ దుర్గాప్రసాద్ చీపురుపల్లి కన్వీనర్ అద్దాల రామచంద్రరావు, విజయనగరం ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్, విజయనగరం మండల కమిటీ సభ్యులు మామిడి అప్పారావు, జిల్లా సెక్రెటరీ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా గోకులం పథకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రైతులకు అండగా గోకులం పథకం ఉందని ఎంపిపి మామిడి అప్పలనాయుడు అన్నారు. బుధవారం విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పలనాయుడు మాట్లాడుతూ విజయనగరం మండల పరిధిలో 131 మంది పాడి రైతులకు గోకులం 11 ద్వారా పశువుల షెడ్ల నిర్మాణణాలకు లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు కోసం పంపినట్లు తెలిపార. ఈ పథకానికి సంబంధించి భూ పట్టాదారుని పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఎన్ఆర్ఇజిఎస్ జాబ్ కార్డ్ ఉండాలన్నారు. ఇంకా ఎవరైనా రైతులకు కావాలి అనుకుంటే గ్రామసభల ద్వారా మండల పరిషత్ కు దరఖాస్తుల పంపితే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గంటా వెంకట్రావు, ఎపిఒ వెలుగు మోహన్, వెటర్నరీ వైద్యులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతలో మహిళలది ప్రధాన పాత్ర

మెప్మా పీడీ జివిసి రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిసరాల పరిశుభ్రత పాటించడంలో ప్రధానమైన భూమిక అందరిదీ అని, దీనిలో మహిళ పాత్ర చాలా ప్రాముఖ్యత గలదని మెప్మా పీడీ జివిసి రాజు అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం కాంట్రాక్టర్స్ హాలులో విజయనగరం, నెల్లిమర్ల పురపాల సంఘ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రిసోర్స్ పర్సన్‌లకు వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే దగ్గరే వేరు చేసే విధానం గురించి శిక్షణ ఇచ్చారు. ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలను అక్కడే వేరుచేసి దాని నుండి హోం కంపోస్ట్ విధానం ద్వారా వ్యర్థాలను కంపోస్టుగా మార్చి ఆ కంపోస్టును పెరటిలోని టెర్రస్ పైన ఉన్న మొక్కలకు వేసి పుష్టికరమైన ఆరోగ్యకరమైన ఫలాలను పొందే ఆరోగ్యాలను కాపాడుకునే విధానాన్ని వివరించారు. సింగిల్ యూనిట్ ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

భారత రాజ్యాంగ దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజీ, డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఇతర జిల్లా అధికారులు భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వర్రావు అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ దేవ్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిగొప్ప రాజ్యాంగం : జెసి

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిగొప్పదని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ భారత రాజ్యాంగాన్ని తెలుసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్దులకు వ్యాసరచన, వకృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 13 మంది విజేతలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రాలను, మెడల్స్‌ను పంపిణీ చేసి అభినందించారు. మాక్ అసెంబ్లీ ద్వారా రాష్ట్రస్థాయికి ఎంపికైన మరో 8 మంది జిల్లా విద్యార్దులను కూడా ప్రశంసించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. మన రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26వ తేదీన రాజ్యాంగాన్ని ఆమోదించిందని, జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో డిఇఒ యు.మాణిక్యంనాయుడు, ఎసి సన్యాసిరాజు, ఇతర అధికారులు, విద్యార్థులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లౌకిక వాదానికి ప్రతీకగా భారత రాజ్యాంగం



కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కంటోన్మెంట్ : రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మన రాజ్యాంగం చారిత్రాత్మక గ్రంథం : జెడ్‌పి ఛైర్మన్

జెడ్‌పి కార్యాలయం ఆవరణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. దేశ సార్వభౌమాదికారానికి ప్రతీక మన రాజ్యాంగం అని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే జయమణి, వైసిపి నాయకులు జైహింద్ కుమార్, ఈశ్వరరావు రామారావు కిషోర్ , కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

విజయనగరంటౌన్ : నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి , కమిషనర్ పల్లి నల్లనయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాబా సాహెబ్ డా.బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సమకూర్చిన వాటర్ బాటిళ్ళను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, రిసార్స్ పర్సన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో..

పాలిటెక్నికల్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చారిత్రక రోజును పురస్కరించుకొని రాజ్యాంగ విలువలు పౌర హక్కులు, బాధ్యతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన ఎస్సే రైటింగ్ కాంపిటీషన్స్‌లో ప్రథమ, ద్వితీయధమ ద్వితీయ తృతీయ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ సివిఆర్ రామ్మూర్తి , టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు, నేచర్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ జి.దుర్గ పాల్గొన్నారు.

డిబిఎస్‌యు ఆధ్వర్యాన...

దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, గంజిపేట వద్ద రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొంగు భానుమూర్తి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు సమర్పించారు. భారత రాజ్యాంగ పీఠికను సభ్యులందరి చేత చదివించి భారత రాజ్యాంగాన్ని కాపాడకుంటామని అందరితోనూ చిట్టిబాబు ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఫలాలు అందరికీ చెందాలని అన్నారు. పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వాన్ని ప్రబోధించే విలువైన అతిపెద్ద భారత రాజ్యాంగం ఈ దేశానికి దిక్సూచి అని తెలిపారు. భారత రాజ్యాంగం విలువలు సమాజంలోకి తీసుకుని వెళ్లి,హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు జిల్లా ప్రోగ్రాం కార్యదర్శి ఊదరపల్లి రాము, యందవ పోలయ్య, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, ఆర్.గణపతమ్మ తదితరులు తదితరులు పాల్గొన్నారు.



జెడ్‌పి కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్‌పి ఛైర్మన్



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులతో జెసి సేధుమాధవన్, డిఇఒ మాణిక్యంనాయుడు

పట్టాలిచ్చేంత వరకూ పోరాటం

సచివాలయాల్లో సిపిఎం ఆధ్వర్యాన వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పట్టణాల్లో నివాసం ఉంటున్న పేదలకు వారు నివాసం ఉన్న చోటే ఇల్లుపట్టాలిచ్చి, పేదలకు రెండు సెంట్లు భూమి ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. బుధవారం 33, 55, 54 సచివాలయాల్లో ఎల్‌బిజి నగర్, రామకృష్ణనగర్‌లో నివాసమున్న పేదలు తాము నివాసమున్నచోటే పట్టాలివ్వాలని ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు అందజేశారు. తక్షణమే వాటిని ఆన్ లైన్ చేసి దర్యా ప్తు జరపాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ ఇళ్లు కడతామని రాష్ట్ర ప్రభుత్వం జీవో 30ను విడుదల చేసి ఏడాదైందన్నారు. అయినా విజయనగరం పట్టణంలో ఏ ఒక్కరికీ జీవోను అమలు చేయలేదన్నారు. రామకృష్ణానగర్ ఎల్‌బిజి నగర్, గురజాడనగర్, వినాయక నగర్, జొన్నగుడ్డి, బుంగవీధి, పూల్‌బాగ్, పిజి కాలేజీ ఎదురుగా, గంజిపేట, గొడగలవీధి, స్టేడియంపేట, నల్లచెరువు, దాసన్నపేట, ఎర్రచెరువులో పేదలు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారన్నారు. వారికి నేటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. తక్షణమే పట్టాలిచ్చి ఇల్లు కట్టాలని కోరారు. 54, 55 సచివాలయంలో పి.రమణమ్మ, నాయకత్వంలో వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో జగదాంబ, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతినిస్తున్న సిపిఎం నాయకులు, పట్టణ పేదలు

మరణించిన పోలీసు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలో కొత్తవలస పోలీసుస్టేషన్‌లో కానిస్టేబులుగా పని చేస్తూ, ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో మరణించిన బొబ్బిలి రామకోటి కుటుంబానికి స్టేట్ బ్యాంకు పోలీసు సేలరీ ప్యాకేజ్ ప్రయోజనంగా మంజూరు చేసిన రూ.1కోటి చెక్కును ఆమె సతీమణి సిహెచ్.రమకు స్టేట్ బ్యాంకు అధికారుల సమక్షంలో బుధవారం పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగాఎస్‌పి ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ - జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందరికీ స్టేట్ బ్యాంకు పోలీసు సేలరీ ప్యాకేజ్ ను ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఎవరైనా పోలీసు ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవసాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.1కోటి ఆర్థిక సహాయాన్ని ఎస్‌బిఐ అందించ నుందన్నారు. కార్యక్రమం లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్‌బిఐ రీజనల్ మేనేజరు ఎం.సురేష్ బాబు, కంటోన్మెంట్ చీఫ్ మేనేజరు పి.రఘురామ్, ఆర్‌బిఒ చీఫ్ మేనేజరు విజయకుమార్, ఎస్‌బిఐ డిపాజిట్స్ మేనేజరు ఒమ్మి వెంకటరావు, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, పోలీసు అసోసియేషను అధ్యక్షులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొప్పల వెలమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుగా సత్యారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొప్పుల వెలమ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుగా కోరుపోలు సత్యారావు నియమితులయ్యారు. సేవా భావంతో వెలమ వివాహ వేదిక ద్వారా 1275 పైగా ఉచిత వివాహాలు చేయించడం, తాటిపూడి జలాశయానికి కూడా గొర్రిపాటి వారిపేరును తీసుకురావడంలో ప్రధానపాత్ర పోషించడంతో సత్యారావును జాతీయ అధ్యక్షులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జాతీయ కన్వీనర్లు శంబంగిరావు, కూనిరెడ్డి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

కరాటేలో రజిత పతకం

కొత్తవలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 17లో 32 కేజీల బాలికల విభాగంలో వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎస్.దేవిశ్రీ రజిత పతకం సాధించినట్లు హెచ్ఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి పతకం సాధించినందుకు గాను కోచ్ రాజబాబును బుధవారం ఉపాధ్యాయులు సత్కరించి విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రూ.లక్ష వితరణ

నెల్లిమర్ల: మండలంలోని తంగుడుబిల్లిలో ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లక్ష రూపాయలు ఆర్థిక వితరణ అందజేశారు. బుధవారం తంగుడుబిల్లి గ్రామంలో పైడితల్లి, ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆయన పాల్గొని ఈ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన నాయకులు బొత్స సందీప్, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వర్గీస్ కురియన్ జయంతి

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ పాల దినోత్సవం సందర్భంగా బుధవారం డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.రూపవాణి అధ్యక్షతన డాక్టర్ వర్గీస్ కురియన్ చేసిన శ్వేత విప్లవం, ఆపరేషన్ ఫ్లడ్, పాలు ఉత్పత్తులు అభివృద్ధి రైతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు ఎస్.శివాజీ, కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ జయపాల్ రావు, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ బిశుభ, రాఘవ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న దురాచారాన్ని అరికట్టాలి

శృంగవరపుకోట: ఎస్‌కోట న్యాయస్థానం ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ బి.కనకలక్ష్మి, సిబ్బంది, న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయించి భారత రాజ్యాంగ పీఠికను చదివి, దాని విశిష్టతను తెలియజేశారు. అనంతరం కక్షిదారులకు భారత రాజ్యాంగం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరకట్నం ఇవ్వడం గానీ తీసుకోవడం గాని రెండూ నేర పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఆడపిల్లలు కూడా అన్ని రంగాలలో ముందంజలో పయనిస్తున్నందున ఈ వరకట్న దురాచారాన్ని అరికట్టడంలో చదువుకున్న విజ్ఞులు అందరూ తమ వంతు బాధ్యతను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమానికి కక్షిదారులు న్యాయవాదులు హాజరయ్యారు.

పంటల పరిశీలన

డెంకాడ: మినుము పంటలో మరూకా మచ్చల పురుగు సంక్రమణ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో గంట్లాం గ్రామంలో కంది సురేష్ కుమార్‌కు చెందిన పంటని బుధవారం ఎఒ టి.సంగీత క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఈ పురుగు పూత, పిందె దశలలో ఎక్కువగా దాడి చేసి పూలు, చిన్న పిందెలను తినేస్తాయన్నారు. దీని వల్ల గింజల దిగుబడికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో పురుగును నివారించుకోవాలన్నారు.

బొబ్బిలిని సుందరంగా తీర్చిదిద్దుతాం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీని సుందరంగా తీర్చి దిద్దుతామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని రాణి మల్లమ్మదేవి పార్కు వద్ద ఐలవ్ బొబ్బిలి థీమ్, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన ఎల్ఇడి లైట్లను బుడా చైర్మన్ తెంటు రాజాతో కలిసి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపాలిటీలో ఉన్న చెరువులు, పార్కులను అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ శరత్, వైస్ చైర్మన్ చెలికాని మురళీ, కౌన్సిలర్లు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలపై రైతులకు శిక్షణ

బాడంగి: మండలంలోని కోడూరులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో బుధవారం మామిడి రైతులకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పైనా, కోత, కోత అనంతర యాజమాన్య పద్ధతులపైనా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాడంగి, రామభద్రపురం ఉద్యాన అధికారుల అధ్యక్షతన జిల్లా ఉద్యాన శాఖ అధికారి చిట్టిబాబు కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు మాట్లాడుతూ మామిడి రైతులకు పూత, కాయ సీజన్‌లో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలు, పురుగులు, తెగుళ్ల వివరాలు, వాటి నివారణకు పిచికారి చేయాల్సిన మందుల వివరాలను వివరించారు. మామిడి ఫ్రూట్ కవర్స్ వినియోగం వల్ల ప్రయోజనం గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, విహెచ్ఎ దివ్య, శివ, విజయ్ రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ


యూనిఫారం అందిస్తున్న గౌరు

బాడంగి: మండలంలోని కామన్నవలస సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఐఒసిఎల్ పెట్రోల్ బంక్ యజమాని, ఎంపిటిసి, టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు బుధవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. రామభద్రపురం నుంచి బాడంగి, బాడంగి నుంచి రామభద్రపురం వెళ్లే ఆటో స్టాండ్ డ్రైవర్లు సుమారు 200 మందికి ఉచితంగా యూనిఫాంలు గౌరు చేతులు మీదుగా అందించారు. ఏటా దసరా పండగ సందర్భంగా ఆటో డ్రైవర్‌లకు ఉచితంగా యూనిఫారంలు ఇచ్చే కార్యక్రమం ఉంటుందని ఆయన అన్నారు.

మాయమైన మరు భూమి

◆ఆఖరి క్షణాలకు తప్పని అవస్థలు ◆ హైవే కాంట్రాక్టర్ హామీ హుళక్కేనా..? ◆ఆందోళనలో జామి ప్రజానీకం

ఎంత సంపాదించినా... ఏమి సాధించినా... ఆఖరి క్షణాలకు ఆరడుగుల నేల చాలంటారు... కానీ జామి ప్రజలకు ఆ ఆరడుగుల నేల కరువైంది. ఏ చిన్న కుగ్రామం వెళ్లినా, ఊరు చివరిన ఉండే.. మరు భూములు భూ కైలాశాలను తలపిస్తున్నాయి. కానీ వేలాది ప్రజానీకం ఉన్న జామిలో మనిషి చనిపోతే దహన సంస్కరణాలకు అవస్థలు పడాల్సిన పరిస్థితులు దాపురించాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం శ్మశానాన్ని మింగేసిన విషయం తెలిసిందే. హైవే నిర్మాణం పూర్తయినా, కాంట్రాక్టర్ మాత్రం శ్మశానాన్ని అభివృద్ధి చేయలేదు. ఇప్పటికైనా హైవే కాంట్రాక్టర్‌తో చేసుకున్న ఒప్పందం బయటపెట్టి, శ్మశాన అభివృద్ధికి పాలకులు, గ్రామ పెద్దలు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి - జామి

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంతో మండలంలో వందల ఎకరాలు పోగొట్టుకున్న విషయం తెలిసిందే. జామి గ్రామంలో రైతుల భూములతో పాటు గ్రామానికి తాతల తండ్రుల నుంచి ఉన్న మరు భూమిని కూడా హైవే మింగేసింది. మండల కేంద్రంలో 16వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇందులో సర్వ మతాల వారు ఉన్నారు. దళితులు, ముస్లింలకు తప్ప దాదాపుగా గ్రామంలో ప్రజానీకం మొత్తానికి ఒకటే శ్మశానం. ఈ నేపథ్యంలోనే మరు భూమి తీవ్రమైన సమస్యగా మారింది. వాస్తవానికి గతంలో ఉన్న మరుభూమి కూడా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి. శ్మశానంలో ఒక పాడుబడ్డ షెడ్, ఒక చేతి బోరు మాత్రమే ఉండేవి. హైవే పుణ్యమా అంటూ అవి కూడా లేకుండా పోయాయి. కనీసం నిలువ నీడ నిచ్చే చెట్టు కూడా అక్కడ లేదంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

శ్మశాన స్థలం మీదుగా హైవే

జాతీయ రహదారి నిర్మాణం శ్మశాన స్థలం మీదుగా వెళ్లిపోయింది. దీంతో ఉన్న కొద్ది పాటి మరుభూమి లేకుండా పోయింది. పోనీ మిగిలిన కొద్దిపాటి స్థలంలో ఊరు మొత్తానికి మరు భూమిగా వాడడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే హైవే కాంట్రాక్టర్‌తో గ్రామ పెద్దలు శ్మశానం అభివృద్ధికి ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

హైవే కాంట్రాక్టర్ హామీ ఏమైంది..?

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం దాదాపుగా పూర్తయి, నెలలు కావస్తుంది. జామి శ్మశానం అభివృద్ధి, కేటాయించిన స్థలం విషయంపై ఎటువంటి స్పష్టతా రాలేదు. అసలు జామి శ్మశానం అభివృద్ధికి ఎటువంటి హామీ ఇచ్చారన్నది బహిర్గతం కావాలని గ్రామంలోని పలు రాజకీయ పార్టీలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆఖరి క్షణాలు.. నరకయాతన

జామి శ్మశానానికి అనువైన స్థలం లేకపోవడం, చివరి క్షణాల్లో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. గతంలో హైవే అవతల వైపు కొంత భాగాన్ని అధికారులు గుర్తించినప్పటికీ, అది నిరుపయోగంగానే ఉంది. ఒకవేళ అక్కడ శ్మశానం అనుకుంటే, హైవే దాటేందుకు నానా అవస్థలు పడాలని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పోనీ ఆ స్థలాన్ని అయినా అభివృద్ధి చేశారంటే అదీ లేదు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో మరుభూమి సమస్య సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు శ్మశాన సమస్యను తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం కాకుంటే, జామి ప్రజలు పెద్ద ఎత్తున హైవేపై నిరసన తెలిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హైవే కాంట్రాక్టర్‌తో జరిగిన ఒప్పందాన్ని బహిర్గతం చేసి, శ్మశాన అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు నిర్మాణంతో బక్కచిక్కిపోయి నీడ లేకుండా పోయిన శ్మశానం


ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న ప్రతినిధి

'ప్యారీ' సల్ఫర్ నిల్వలపై ఆర్‌డిఒ ఆరా

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారీ షుగర్ ఫ్యాక్టరిలో సల్ఫర్ నిల్వలు, వాటి లైసెన్స్ రెన్యువల్, ఇతర అనుమతులపై చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవేణి బుధవారం కర్మాగారాన్ని పరిశీలించి, ఆరా తీశారు. షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సల్ఫర్ కొనుగోలు రికార్డులు పరిశీలించారు. సల్ఫర్ సేఫ్టీ ఏ విధంగా ఉందో, ఒకవేళ ప్రమాదాలు జరిగితే నీటి సదుపాయాలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లపాటు సల్ఫర్ స్టోరేజ్ అనుమతులు రెన్యువల్ చేయాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలుష్య నియంత్రణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఐ.కృష్ణలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కోట గిరి, విఆర్ఒ దుర్గారావు, షుగర్ ఫ్యాక్టరీ ప్లాంట్ మేనేజర్ వీరబాబు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ నెల్లిమర్ల యూనిట్ ఎన్నిక


ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నెల్లిమర్ల తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికలు అధికారులుగా ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రతినిధులు వై.ఆనంద్ కుమార్, ఎం.శ్రీనివాసరావు వ్యవహరించగా పరిశీలకులుగా ఎస్ ఆదిలక్ష్మి వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎండిఒ కార్యాలయం వద్ద 300 మందితో ర్యాలీ చేపట్టి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి సురేష్, మాజీ అధ్యక్షులు రాజగోపాల్, జాయింట్ సెక్రటరీలు స్వప్న, ఆదిలక్ష్మి, కె.బి.శ్రీను, మెడికల్ ఆఫీసర్ శిరీష, ఆక్విబ్, సబ్ రిజిస్టర్ రాజు, ఎస్‌టిఒ వాసు పాల్గొన్నారు.

నెల్లిమర్ల తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం

అధ్యక్షులుగా కె.ధనుంజయ (కొండవెలగాడ పిహెచ్‌సి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్.సురేష్, ఉపాధ్యక్షులుగా పి.సూర్యనారాయణరాజు, కె. రామకృష్ణ, జి.ఉమా మహేశ్వరరావు, ఎం. నారాయణరావు, వి.చందన, కార్యదర్శిగా ఎన్. మోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.హరిప్రసాద్, ఎం.శ్రీను, ఎం.శ్రీనివాసరావు, ఎ.మాధవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె. అశోక్, కోశాధికారిగా సి.హెచ్. వాసుదేవరావు ఎన్నికయ్యారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

బొబ్బిలి: మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. పట్టణంలోని బుధవారం పలు వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. 11వ వార్డులో కురుమెళ్ల వీధిలో కురుమెళ్ల మనోహర్ ఇంటి నుంచి ఎం.మాధవరావు ఇంటి వరకు రూ.10లక్షలతో సీసీ రోడ్డు, 29వ వార్డులో బిగ్‌సి షోరూమ్ నుండి రమణమ్మ ఇంటి వరకు, షైక్ బీబీ టూ జరైన బీబీ ఇంటి వరకు రూ.2.90లక్షలతో రోడ్డు, 27 వార్డులో ఆల్వార్ వీధి ఎస్.జగన్నాథం ఇంటి నుండి డి.అప్పయ్యమ్మ ఇంటి వరకు రూ.2.95 లక్షలతో సీసీ డ్రెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలక్ష్మి, డిఇ కిరణ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పత్తి విక్రయ కేంద్రాల జాడేది?


సతివాడలో షెడ్డులో నిల్వ చేసిన పత్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలో పత్తి విక్రయ కేంద్రాలు అందుబాటులో లేక పత్తి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి విపత్తులు తట్టుకొని పత్తి పంటను ఇంటికి తెచ్చుకున్న రైతుకి విక్రయ కేంద్రాలు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. బొప్పడాం, సతివాడ, మదుపాడ గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో పత్తి పంటను పండించిన రైతులు అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇదే సమయాన్ని దళారులు తమకు అనుకూలంగా మార్చుకొని రైతులను క్వింటా రూ. 5110కి ఇవ్వమని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.8,110 నిర్ణయించి పత్తి కనుగోలు కేంద్రాలు రాజాం, రామభద్రపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. దీంతో రైతులు ఇక్కడ నుంచి పత్తిని తరలించాలంటే 60 నుంచి 70 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంది. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పండించిన పత్తి పంటను దళారులకు ఇవ్వలేక, దూరంగా ఉన్న ప్రభుత్వ విక్రయ కేంద్రాలకు తరలించలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సతివాడ, బొప్పడాం గ్రామాలకు అందుబాటులో ఉండేలా పత్తి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు

మానవహక్కుల సంఘం జాతీయ చైర్మన్


భోగి సాయికుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ప్రసాదరావు

ప్రజాశక్తి - రామభద్రపురం

మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని మానవహక్కుల సంఘం నేషనల్ చైర్మన్ ప్రసాదరావు హెచ్చరించారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో బుధవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులకు భంగం కలిగితే తక్షణమే మానవహక్కుల కార్యకర్తలు రక్షణగా ఉంటారన్నారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందించడంలో ముందుండాలని, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం, మాదకద్రవ్య వినియోగం, రవాణా వంటి వాటి దుష్పలితాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామన్నారు. పార్టీలకు, మతాలకు,కులాలకు అతీతంగా మానవహక్కుల సంఘం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రానున్న రోజుల్లో మానవహక్కుల సంఘం ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మానవహక్కుల సంఘం సెక్రటరీగా భోగి సాయికుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీలు వెంకట్, ఎస్‌సి, ఎస్‌టి ప్రెసిడెంట్ కళ్యాణ్ కుమార్, మహిళా వైస్ ప్రెసిడెంట్ చీకటి సుహాసిని పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలపై జరుగుతున్న సర్వేను జిల్లా డైట్ లెక్చరర్ అల్లు శశిభూషణరావు, మండల విద్యాశాఖ అధికారి ఎన్ నాగభూషణరావు అరిగిపాలెంలో పరిశీలించారు. జిఎఫ్ఎల్ఎన్ సర్వేను మండలంలో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు పూర్తి చేయాలన్నారు.

'రైతన్నా మీకోసం'ను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బుధరాయవలస గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని జెసి సేధు మాధవన్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో సాగుతున్న రైతు సర్వే, పంటల స్థితి, పంట నష్టాల అంచనా, రైతులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతు సమస్యలు, సూచనలు, అవసరాలు గ్రామ స్థాయిలోనే తెలుసుకొని వాటిని వెంటనే సంబంధిత విభాగాల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొత్తవలస: మండలంలోని సంతపాలెంచ, గులివిందాడ సచివాలయంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలోపై బుధవారం సిబ్బంది అవగాహన కల్పించారు. ఎపిఎం ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వ్యవసాయంపై వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని గెద్దపేట గ్రామంలో అధికారులు బుధవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎఇఒ సాయిబిందు, ఉద్యానవన సహాయకులు రహిమాన్, జెఎల్ఎం వెంకట రమణ, డిజిటల్ అసిస్టెంట్ శ్రావణి, ఎంఎస్‌కెలు వాసంతి, రామ రాజ్యం రైతుల వద్దకు వెళ్లి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

డెంకాడ: మండలంలో జొన్నాడ పంచాయతీలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మాజీ సర్పంచ్ కోరాడ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో గురుకుల విద్యార్థి

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వి. వెంకటేష్ స్టూడెంట్ అసెంబ్లీలో బుధవారం పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ రఘురాం నాయుడు తెలిపారు. ముందుగా రాజాం నియోజకవర్గంలో మాక్ అసెంబ్లీ నిర్వహించి ప్రతిభ సాధించిన వెంకటేష్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. వెలగపూడి అసెంబ్లీలో 175 మంది ఎమ్మెల్యేల ఆధారంగా స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించారన్నారు.

రాజ్యాంగం మనకు వరం : జెసి


మెరకముడిదాం: అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి సేదుమాధవన్

ప్రజాశక్తి- మెరకముడిదాం

ప్రపంచంలోనే అతిగొప్పదిగా కొనియాడబడుతున్న మన రాజ్యాంగం దేశప్రజలకు ఒక వరమని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ అన్నారు. దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా తీర్చిదిద్దినది మన రాజ్యాంగమేనని ఆయన స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అందరిచేతా ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగ విశిష్టతను, అంబేద్కర్ గొప్పదనాన్ని జెసి కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ భాస్కరరావురెఒ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేసిన జెసి

మండలంలోని గర్భాం రైతు సేవా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. చేసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని జెసి ఆదేశించారు.

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు, సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంఛార్జి హెచ్ఎం, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రహీం షేక్ లాల్ పాల్గొన్నారు. పట్టణంలోని వ్యవసాయ సహకార పరిమితి సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గేదల శ్రీను, వబ్బిన గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు డోల కేశవ, తెరపల్లి కోటారావు, గుర్రపు శ్రీను పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


వేపాడ: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

దత్తరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శివాజీ, పంచాయతీ ఎఇ రమ, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, నవీన్, రవిశంకర్, మండల కోఆర్డినేటర్ గోవింద్, పాల్గొన్నారు.

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ స్వరూపారాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ విశిష్టతను సిబ్బందికి వివరించి, కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

మెంటాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, జిటిపేట హైస్కూల్‌లలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఎంపిడిఒ సుదర్శన్, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గంద్రేటి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ రేగిడి రాంబాబు ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని అధికారులు, నేతలు పూల మాలలు వేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ విమలకుమారి, రాయిపల్లి రవిశంకర్, ముగడ లింగేశ్వరరావు, రెడ్డి రాజగోపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న జడ్జి రోహిణిరావు

విజయనగరం: బాధ్యత గల ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని చదివి అవగాహన చేసుకోవాలని యువ సమ్మేళనం ప్రతినిధి కె.అభిమన్యు అన్నారు. సిటీయూ పరిసర ప్రాంతాల్లో రాజ్యాంగ పీఠికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్టేళ్ల ప్రశాంత్, దివ్య, జంపన్న, పాంగి మోహన్ పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణి రావు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి లా దినోత్సవం, రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించారు. అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ కార్యాలయాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.


గంట్యాడ: నివాళులర్పిస్తున్న ఎంపిపి, తదితరులు

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని అందరం కొనసాగిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, కెజిబివి, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ, సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

గంట్యాడ: ప్రపంచంలోనే అత్యుత్తమ అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనదేనని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. మండల కార్యాలయంలో బుధవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి భారత రాజ్యాంగం హక్కులను బాధ్యతలను అర్థం చేసుకోవాలని ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి మదనాపురం మోడల్ స్కూల్లో అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ఆర్ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్ల: అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలని అంబేద్కర్ ఇండియా మిషన్ (ఎయిమ్) జిల్లా ఇంచార్జి అడ్డూరి సీతబాబు అన్నారు. తహశీల్దారు కార్యాలయం వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుర్ల మండలపరిషత్ కార్యాలయాల సముదాయం వద్ద ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.రవికుమార్, డిప్యూటి తహశీల్దార్ నారాయణమ్మ, ఎపిఒ రత్నమాల, ఎపిఎం భారతి, ఎయిమ్ మండల కన్వీనరు తలే నారాయనప్పడు పాల్గొన్నారు.

బొండపల్లి: విద్యార్థులు విద్యను అభ్యసించేటప్పుడు క్రమశిక్షణతో మెలగాలని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ అద్దెల విజయ్ రాజ్ కుమార్ అన్నారు. బుధవారం బొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్ఎం ఉమామహేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలిత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేత్కర్ చిత్రపటానికి మేజిస్ట్రేట్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు సి.వాసుదేవరావు, సాయిశేఖరరావు, పిఇటి గెద్ద గురునాయుడు, పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహనికి తహశీల్దార్ సునీత పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో సిఐ షణ్ముఖరావు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎండిఒ ఆఫీసులో ఎంపిడిఒ ఎస్ రమణయ్య అధ్యక్షతన అంబేద్కర్‌కు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, పిఎసిఎస్ అధ్యక్షులు కోళ్ల శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్వాక్రా సంఘాల సభ్యులు లక్ష్య సాధనలో ముందుకు సాగాలని వెలుగు డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మోడల్ మండల సమా ఖ్యలకు వార్షిక ప్రణాళికపై జిల్లా స్థాయిలో మూడు రోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత కింద 10 మండల సమాఖ్యలను, 2,3,4, విడతలు కింద 3 మండల సమాఖ్యలను ఆదర్శవంతంగా తయారు చేయడం కోసం శిక్షణ తరగతులకు ఎంపిక చేశామన్నారు. ముఖ్యంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం కోసం, లక్ష్యాలను చేరడం కోసం ఇటువంటి శిక్షణలు అవసరమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1100 కోట్లు రుణాలు ఇచ్చి మహిళలకు ఆర్థిక భరోసాతో పాటు పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ శిక్షణలో వెలుగు డిఆర్‌డిఎ అదనపు పథక సంచాలకులు కె.సావిత్రి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ.చిరంజీవి, ఎపి ఎంఎస్ విశ్వేశ్వరరావు, ఎస్‌విడి సురేష్, పద్మ, 9 మండలాల ఎపిఎంలు, సిసిఎస్, ఎల్‌సిలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.